

బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసిన రాష్ట్ర నాయకుడు నేమూరి మహేశ్ గౌడ్

బీఆర్ఎస్ పార్టీని బలోపేతానికి కృషి

✻ మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్

చర్లపల్లి, జనవరి 31: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మాజీ మంత్రి, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నేమూరి మహేశ్ గౌడ్ పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీని మరింత బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసిగిపోయారని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం తథ్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నోవాటెల్‌లో హై లైఫ్ ఎగ్జిబిషన్

సిటీ బ్యూరో, జనవరి 31(నమస్తే తెలంగాణ): హైటెక్ సిటీలోని హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ప్రముఖ హై లైఫ్ ఫ్యాషన్స్ ఎగ్జిబిషన్‌ను సినీ నటులు సంచి రాయ్, అంగనా రాయ్‌తో పాటు పలువురు సెలెబ్రిటీలు, ఫ్యాషన్ ప్రియులు అట్టహాసంగా ప్రారంభించారు. ఈ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ శుక్రవారం నుంచి 3వ తేదీ వరకు కొనసాగుతుందని హై లైఫ్ ఎగ్జిబిషన్స్ ఎండీ, సీఈవో అబీ డోమినిక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎగ్జిబిషన్‌లో నూతన సంవత్సర ఫ్యాషన్ దుస్తులు, ట్రెండీ ఫ్యాషన్, గ్లామర్, స్టైల్స్, లగ్జరీ వస్తువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఫెస్టివల్ వేర్, బ్రైడల్ వేర్, జ్యుయలరీ ఫ్యాషన్ ప్రియులను ఆకర్షించే విభిన్న రకాలను ప్రదర్శనకు ఉంచామని వివరించారు. టాప్ డిజైనర్స్‌తో తయారు చేయించిన 350 పైగా ఫ్యాషన్ దుస్తులు ఉన్నాయని వెల్లడించారు.

నిబంధనలు పాటించకపోతే లైసెన్స్ రద్దు

సిటీబ్యూరో, జనవరి 31(నమస్తే తెలంగాణ)/ఖైరతాబాద్: రోడ్డు భద్రతా మాసోత్సవంలో 15 లక్షల మంది విద్యార్థులు, ప్రజలను భాగస్వామ్యం చేసి అవగాహన కల్పించామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవ ముగింపు సందర్భంగా ట్యాంక్ బండ్ వద్ద శుక్రవారం హెచ్ఎండీఏ గ్రౌండ్ నుంచి సెక్రటేరియట్ వరకు ర్యాలీ తీశారు. అనంతరం, సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. తెలంగాణ పాఠ్యాంశాల్లో రహదారుల భద్రతా అంశాన్ని చేరుస్తామన్నారు.

భూ సేకరణ గుర్తింపు అభ్యంతరాలపై విచారణ

భూ సేకరణ గుర్తింపు పక్రియపై వచ్చిన అభ్యంతరాలను విచారిస్తున్న మేడ్చల్ జిల్లా అధికారులు

మేడ్చల్, జనవరి 31(నమస్తే తెలంగాణ): ఎలివేటెడ్ కారిడార్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ గుర్తింపు పక్రియ పూర్తయిన అనంతరం, వచ్చిన అభ్యంతరాలపై అధికారులు విచారణ చేస్తున్నారు. ప్యారడైజ్ నుంచి తూంకుంట ఔటర్ రింగు రోడ్డు వరకు 18 కిలో మీటర్ల మేరకు నిర్మించిన నున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులకు సంబంధించి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలో భూ సేకరణ గుర్తింపు పక్రియ పూర్తి చేశారు. అయితే, భూ సేకరణ పూర్తి అనంతరం నోటిఫికేషన్ జారీ.., అనంతరం మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాకు సంబంధించి 325 అభ్యంతరాలు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందులో 40 వరకు రెవెన్యూకు సంబంధించిన అభ్యంతరాలకు, అభ్యంతరాలు తెలిపిన వారికి నోటీసులు జారీ చేసి విచారణ చేశారు. మరో 285 మంది అభ్యంతరాలు తెలిపిన వారికి నోటీసులు ఇచ్చి విచారించేందుకు హెచ్ఎండీఏ అధికారుల అనుమతి రావాల్సి ఉంది. అయితే, ఇప్పటి వరకు అభ్యంతరాల విచారణపై హెచ్ఎండీఏ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో అభ్యంతరాలను పరిష్కరించేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉంటుందని అధికారుల ద్వారా తెలిసింది. బ్రిడ్జి నిర్మాణ పనుల ప్రారంభానికి వచ్చే సాంకేతిక సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు పోవాల్సి ఉంది. ఎలివేటెడ్ కారిడార్ బ్రిడ్జి నిర్మాణ పనులలో భాగంగా మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో 348 నిర్మాణాలు కోల్పోనుండగా, 1,12,033 చదరపు అడుగుల స్థలం అవసరం ఉండటంతో భూ సెకరణ చేశారు.

హెచ్ఎండీఏకు నివేదిక

ఎలివేటెడ్ కారిడార్ బ్రిడ్జి నిర్మాణ పనులలో భాగంగా కోల్పోతున్న 348 నిర్మాణాలు, 1,12,033 చదరపు అడుగుల ఖాళీ స్థలాన్ని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా సర్వే డిపార్ట్‌మెంట్ శాఖ గుర్తించింది. అయితే, 348 నిర్మాణాల యజమానుల, 1,12,033 చదరపు అడుగుల స్థలాలకు చెందిన యజమానుల జాబితాను సిద్ధం చేసిన నివేదికను మేడ్చల్ జిల్లా అధికారులు హెచ్ఎండీఏకు అందజేశారు. హెచ్ఎండీఏ ముందుగా వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి అ తర్వాత ఆస్తుల, స్థలాలకు ఆస్తి నష్ట పరిహారం చెల్లింపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. గత నవంబర్ 17న భూ సేకరణ పక్రియపై నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, హైదరాబాద్ జిల్లా పరిధిలో భూ సేకరణ గుర్తింపు పక్రియలో అనేక అభ్యంతరాలు వచ్చాయి. ఎలివేటెడ్ కారిడార్ బ్రిడ్జి నిర్మాణ పనులకు సంబంధించి వస్తున్న సాంకేతిక సమస్యలు అధిగమించేది ఎప్పుడు? బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యేది ఎప్పుడు? అని ప్రజల నుంచి అనేక ప్రశ్నలు వస్తున్నాయి.

కేంద్ర బడ్జెట్‌పై గంపెడాశలు

కేంద్ర వాటాగా నిధులిస్తేనే.. మెట్రో పరుగులు

లేదంటే కీలకమైన ప్రాజెక్టుకు అడ్డంకిగా మారనున్న నిధుల కొరత

ఫేజ్-2లో కేంద్ర వాటాగా రూ.4,230 కోట్లు కోరిన రాష్ట్ర సర్కారు

సిటీబ్యూరో, జనవరి 31(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహా నగరానికి మెట్రో రెండో దశ విస్తరణ అత్యంతక కీలకంగా మారింది. కేంద్ర వాటాతో కలిసి తొలిసారిగా చేపడుతున్న ఈ ప్రాజెక్టు మొత్తం విలువ రూ. 24 వేల కోట్లు. కాగా, ఇందులో కేంద్రం నుంచి 18 శాతం మేర ఆర్థిక సహకారం అందాల్సి ఉంది. ప్రస్తుతం ఫేజ్–2 విస్తరణ కోసం అనుమతులు కోరుతూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపగా ప్రస్తుతం పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే వస్తున్న కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు అత్యంత ప్రముఖ్యంగా మారాయి. కేంద్రం నుంచి వచ్చే వాటా ఆధారంగా ప్రాజెక్టు పనులు సాగనున్నాయి.

76.4 కిలోమీటర్ల మేర మెట్రో..

నగరంలో 76.4 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరించాలని, రూ. 24,269 కోట్ల అంచనా వ్యయంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ప్రాజెక్టుగా నిర్మించేందుకు డీపీఆర్ రూపొందించారు. ఇందులో కేంద్రం 18 శాతం వాటాగా రూ. 4,230 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం వాటాగా రూ.7,313 కోట్లు, లోన్ల రూపంలో 11,693, పీపీపీ కంపొనెంట్‌గా రూ. 1,033 కోట్లతో వచ్చే నాలుగేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రణాళికలను హెచ్ఎంఆర్ఎల్ సన్నాహాలు చేసింది.

డీపీఆర్‌కు మోక్షం లేదు..

ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన మెట్రో ఫేజ్–2 ప్రాజెక్టుకు ఆమోద ముద్ర ఇప్పటికీ పడలేదు. 76 కిలోమీటర్ల పొడువునా నగరం నలువైపులా విస్తరించేలా హెచ్ఎంఆర్ఏ రూపొందించిన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టును, రాష్ట్ర క్యాబినెట్ ఆమోదంతో నవంబర్ మొదటి వారంలోనే కేంద్రానికి చేరింది. కానీ, ఇప్పటివరకు ఆ ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వం దృష్టికి రాలేదు. ఓ వైపు ఫేజ్–2 మెట్రోను ప్రతిష్టాత్మకంగా చేపట్టామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందే తప్పా, అందుకు తగినట్లుగా నిధుల సేకరణ అంశం క్షేత్రస్థాయిలో విరుద్ధంగా ఉన్నది. ఇప్పటికీ ఫైలును కదలించే విషయంలో రాష్ట్ర సర్కారు ఉత్సాహానికి కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదు. అదే విధంగా కీలకమైన డీపీఆర్‌కు ఇప్పటి వరకు ఆమోదించకపోవడంతో నిధుల సర్దుబాటు ఎలా ఉంటుందనేది ఇప్పుడు మెట్రో వర్గాలను ఆందోళన కలిగిస్తోంది.

కేటాయింపులు ఉంటాయా?

కేంద్రం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం గంపెడాశలు పెట్టుకున్నది. రాష్ట్రాలతో పాటు, మోదీ సర్కారు కేటాయింపులపై ఆసక్తిగా పరిశీలిస్తున్నది. ఈ క్రమంలో మెట్రో ఫేజ్–2 ప్రతిపాదనలకు కేంద్రం బడ్జెట్ కేటాయింపులు జరిగితే.., ప్రాజెక్టుకు భవిష్యత్తులో నిధుల కొరత తలెత్తే పరిస్థితి ఉండదు. లేదంటే ప్రభుత్వమే సొంతంగా నిధులు సేకరించుకుని ప్రాజెక్టులను పట్టాలెక్కించాల్సిన దుస్థితి రానుంది. ఇక ఇతర బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి సేకరించే దాదాపు రూ. 11,000 కోట్లకు కేంద్రం పూచీకత్తుగా ఉంటుంది. ఈ విషయంలోనూ కేంద్రం ఎలాంటి మెలిక లేకుండా ఆమోదం తెలిపితేనే నగరానికి రెండో దశ మెట్రోకు తుది రూపం రానుంది.

ముదిరాజుల హామీని నిలబెట్టుకోండి

మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్

వెంగళరావునగర్, జనవరి 31: ఎన్నికల సమయంలో ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీడీ నుంచి బీసీ ఏలోకి మారుస్తామన్న హామీతో పాటు ఇతర హామీలను తక్షణమే నెరవేర్చాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమీర్‌పేట్‌లోని ఓ హోటల్‌లో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బండ ప్రకాష్ ముదిరాజ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం, రాష్ట్ర నాయకులు తలారి మల్లేశం, పెద్ది విజయ్ కుమార్, బల్ల సత్తయ్య, నందుల వరలక్ష్మి, యాదయ్య, బొక్క శీను తదితరులు హాజరై ప్రసంగించారు. ముదిరాజ్ మహాసభ ఏర్పాటు, సాధించిన విజయాలు భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించెదరు. 2009లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి తమ న్యాయమైన ఆకాంక్ష బీసీ ఏ లోకి మార్చేందుకు జీవో నం.15 తీసుకవచ్చారని తెలిపారు. కాగా, కొందరు న్యాయ స్థానాన్ని ఆశ్రయించగా, ఆ కేసు సుప్రీంకోర్టు వరకు వెళ్లిందని చెప్పారు. సమగ్ర విచారణ అనంతరం, సుప్రీం కోర్టు రాష్ట్ర పరిధిలోని ఈ సమస్యను పరిష్కరించుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి సమస్య పరిష్కారం కాలేదన్నారు. కరీంనగర్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ హామీ ఇచ్చినందునే తమ సామాజిక వర్గ ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు పలికారని చెప్పారు. కోకాపేటలో గత ప్రభుత్వం కేటాయించిన ఐదెకరాల స్థలంలో నిర్మాణాలకు సైతం సహకరించాలని కోరారు. రానున్న బడ్జెట్ సమావేశాలలో ఈ అంశంపై చట్టసభల్లో చర్చించాలని సీఎంకు విన్నవిస్తామని చెప్పారు. ప్రభుత్వం నుంచి సానుకాల స్పందన రాకపోతే ప్రత్యక్ష కార్యాచరణ రూపొందించుకొని ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

తెలుగు సాహిత్య విమర్శ-పర్యాలోచనం గ్రంథావిష్కరణ

తెలుగు యూనివర్సిటీ, జనవరి 31. తెలంగాణ సారస్వత పరిషత్తు ముద్రించిన 'తెలుగు సాహిత్య విమర్శ–పర్యాలోచనం' గ్రంథావిష్కరణ సభ అబిడ్స్ తిలక్ రోడ్డులో గల సారస్వత పరిషత్తు ప్రాంగణంలోని ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ముదిగంటి సుజాతా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు. మంచి రచనలు రావడానికి విమర్శ ప్రక్రియ దోహదపడుతుందన్నారు. ఆధునిక కాలంలో అనేక ధోరణులు సాహిత్య విమర్శలో చోటు చేసుకున్నాయన్నారు. కందుకూరి వీరేశలింగం తెలుగులో తొలి విమర్శ గ్రంథం రాశారని, అనంతర కాలంలో కట్టమంచి రామలింగారెడ్డి వంటి ప్రముఖులు రాశారని ఆమె పేర్కొన్నారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ప్రసంగిస్తూ, ఇటీవల సాహిత్య విమర్శపై నిర్వహించిన అధ్యయన శిబిరంలో వక్తలు చేసిన ప్రసంగాలను, వ్యాసాలను కూర్చి పుస్తకంగా ముద్రించామని వివరించారు. ప్రముఖ సాహితీవేత్తలు ఆచార్య ఎస్వీ రామారావు, మసన చెన్నప్ప, డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, డాక్టర్ డి.చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ వి.త్రివేణి, డాక్టర్ మారోజు దేవేంద్ర పాల్గొని సాహిత్య విమర్శ చరిత్రను, వికాసం అంశాలపై ప్రసంగించారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, ప్రాచ్య కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఏ.సిల్మానాయక్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసులను తక్షణమే పరిష్కరించాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 31: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను తక్షణమే పరిష్కరించి, బాధితులకు వెంటనే న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకటయ్య మాట్లాడుతూ, అణచివేతకు గురైన ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను మానవీయ కోణంలో ఆలోచించి ఒత్తిడులకు తలొగ్గకుండా చట్టపరమైన న్యాయం అందించే దిశగా జిల్లా యంత్రాగం కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టే పౌర హక్కుల రక్షణ చట్టం, అట్రాసిటీ నివారణ చట్టాలను ఖచ్చితంగా అమలయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆయన సూచించారు. కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని, పెండింగ్ ఉంచరాదని, అధికారులు ఎఫ్ఐఆర్ కేసులు నమోదైన వెంటనే విచారణ దశలో ఉన్న బాధితులకు నిబంధనల మేరకు నష్టపరిహారం అందించాలన్నారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్‌కు సంబంధించి ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు లేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. కేసులు నమోదైన వెంటనే త్వరితగతిన దర్యాప్తు ప్రారంభించి, త్వరగా పూర్తి చేసి, న్యాయం చేయాలని సూచించారు. అనంతరం, ప్రజలు అందించిన వినతులను చైర్మన్ స్వీకరించారు. అంతకు ముందు గద్దర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ గౌతమ్, డీసీపీలు కోటి రెడ్డి, పద్మజారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ అధికారులు, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీలో 15 మంది ఉద్యోగులకు వీడ్కోలు

పదవీ విమరణ పొందిన వారిని సన్మానించిన అధికారులు

సిటీబ్యూరో, జనవరి 31(నమస్తే తెలంగాణ): ప్రతి ఉద్యోగికి తాము అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని జాయింట్ కమిషనర్ (అడ్మిన్) ఎస్వీ జానకి రామ్ సాగర్ అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో వివిధ కేటగిరీలలో పనిచేసిన 15 మంది ఉద్యోగులకు ఉద్యోగ వయోపరిమితి పూర్తయిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం రిటైర్మెంట్ వీడ్కోలు సభను నిర్వహించి, వారికి ఘనంగా సన్మానం చేశారు. పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులంతా తమ ఉద్యోగ జీవితంలో ఎంతో నిబద్ధత, అంకితభావంతో సేవలందించారన్నారు. వారి కృషి, అందించిన సేవలు తమ సహచర ఉద్యోగులకు స్ఫూర్తిదాయకమన్నారు. రిటైర్మెంట్ అనేది జీవితంలో కొత్త అధ్యాయం లాంటిదని, రిటైర్మెంట్ పొందిన వారు వారి కుటుంబ సభ్యులతో సమయం గడుపుతూ ఆనందంగా గడపాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పీఆర్వో విజయలక్ష్మీ, ఏఎంసీలు జీవన్ కుమార్, శారద, సహోద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు పీజీ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 31: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు పీజీ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతుందని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.కరుణాకర్ అన్నారు. కూకట్‌పల్లి డిగ్రీ కళాశాలలో తెలుగు సబ్జెక్టులో పీజీ (ఏంఏ) ప్రవేశ పరీక్ష ఉచిత శిక్షణ తరగతులపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిగ్రీ పూర్తైన విద్యార్థులు తెలుగులో పీజీ చేయాలనుకుంటే, ప్రవేశ పరీక్ష కోసం కళాశాలలో ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ర్యాంకును సాధించాలని కోరారు. ఈ సమావేశానికి 33 మంది విద్యార్థులు హాజరు కాగా, 15 మంది పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆధ్యాపకులు లక్ష్మయ్య, కాశీరామ్, కవిత తదితరులు ఉన్నారు.

వంగడాల సృజనలో క్రీడా కృషి అమోఘం

వర్షాధారిత వ్యవసాయం - స్థిర జీవనోపాధికి మార్గాలుపై అంతర్జాతీయ సదస్సు

సైదాబాద్, జనవరి 31: సంతోష్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన కేంద్రం (క్రీడా), ఇండియన్ సొసైటీ ఆఫ్ డ్రైలాండ్ అగ్రికల్చర్ (ఐసీఏఆర్) సంయుక్త ఆధ్వర్యంలో 'వర్షాధారిత వ్యవసాయం–స్థితిస్థాపకత స్థిరమైన జీవనోపాధికి మార్గాలను నిర్మించడం' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న రెండో అంతర్జాయ సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సదస్సుకు వివిధ దేశాలకు, రాష్ట్రాలకు చెందిన 750 మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు, అగ్రి కంపెనీలకు చెందిన ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీహార్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఏకే సింగ్ మాట్లాడుతూ మెట్ట వ్యవసాయంలో ఆధునిక వంగడాలను సృష్టించటంలో క్రీడా చేస్తున్న పరిశోధనలను ఆయన అభినందించారు. శిలాజ ఇంధన వినియోగాన్ని తగ్గించటం ద్వారా స్థితిస్థాపకతను తగ్గించడటం సాధ్యమన్నారు. నీటి సంరక్షణకు, వర్షాధారిత వ్యవసాయంలో అధునీకరణ అంశాలను అన్వేషించాల్సిన అనేక అంశాలపై చర్చలు జరగటం శుభప్రదమన్నారు. డాక్టర్ జేఎస్ సామ్రా, క్రీడా డైరెక్టర్ డాక్టర్ వీకే సింగ్ మాట్లాడుతూ నీటి వనరుల సేకరణ, నీటి పొదుపు సద్వినియోగం, నేల సంరక్షణకు అనుగుణంగా వాతావరణాన్ని తట్టుకునే పంటలు, వాటి పద్ధతులపై చర్చించామన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జేవీఎన్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన శాస్త్రవేత్తలకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న బీహార్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఏకే సింగ్, క్రీడా డైరెక్టర్ డాక్టర్ వీకే సింగ్ తదితరులు